క్లుప్తంగా

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడింది.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కర్లపాలెం: కర్లపాలెం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావు స్థానిక పీహెచ్‌సీ సమీపంలో అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కాటూరి చిన నారాయణ, నాగరాజు కుటుంబ సభ్యులకు వంటపాత్రలు, తాత్కాలిక గుడారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆదేశాల మేరకు బాధితులకు చేయూతనందించామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రవి తదితరులు ఉన్నారు.

ఎంత చెప్పినా 'వ్యర్థం'



భట్టిప్రోలు: భట్టిప్రోలు–బాపట్ల–వెల్లటూరు రహదారి వెంబడి వేస్తున్న వ్యర్థాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా కోళ్ల వ్యర్థాలను చికెన్ దుకాణ యజమానులు ఇక్కడికి తీసుకొచ్చి పడేస్తున్నారు. ఇవి కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వస్తుండటంతో.. వాహన చోదకులు ముక్కుమూసుకుని వెళ్తున్నారు. ఈ సమస్యపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు వ్యర్థాలు వేయకూడదని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ పట్టించుకున్న వారు లేరు. రోడ్ల వెంబడి వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేణుక అంకమ్మకు ప్రత్యేక పూజలు



కర్లపాలెం: ఎంవీరాజు పాలెంలో ఇటీవల ప్రతిష్ఠించిన పిట్లవారి వంశస్తుల ఇలవేల్పు రేణుక అంకమ్మ తల్లికి ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. పిట్లవారి వంశస్తులు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేసుకుని, పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..



భట్టిప్రోలు: భట్టిప్రోలు పాత పోలీస్ స్టేషన్ సమీపంలోని భోగేశ్వరపేట వైపు వెళ్లే రహదారిలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో మురుగు నీరు క్రమబద్ధీకరణలో భాగంగా రహదారిని కొంతమేర పగలగొట్టారు. ఆ రహదారిని అలాగే వదిలేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన్నపాటి కారు వెళ్లాలంటేనే ఫీట్లు చేయాల్సి వస్తోంది. రోజూ ఏదో ఒక ద్విచక్ర వాహనం గుంతలో పడిపోతూనే ఉంది. ఎంతో కాలంగా నెలకొన్న సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు కుమ్మరికుంట వందనం(65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం అఖండ ఫౌండేషన్ ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది కల్లం హరనాథ్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల నగదు అందజేశారు. మామిడి రమేష్, సభ్యులు వంగపాటి శివ, కాగిత కోటేశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఒక సచివాలయం.. సేవలెన్నో..!

- పరిపాలన వ్యవస్థలో ఒక విప్లవం
- గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం
- ఊరు, వార్డు దాటే పనిలేకుండా అన్ని పనులు పూర్తి
- ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- ఖచ్చితమైన లబ్ధిదారుల లెక్క..



తూర్పు బాపట్ల సచివాలయం

బాపట్ల: పరిపాలన వ్యవస్థలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఒక విప్లవం. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకరానికి అడుగులు పడిన క్షణం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన విధానం. సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం. ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి, 10–12 శాఖల అధికారుల ద్వారా ప్రజలకు సేవలు అందించడం నిజంగా ఒక చరిత్ర. ఏ అవసరం వచ్చినా పల్లెదాటే పనిలేకుండా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నారు. సచివాలయాలు ఏర్పాటైనా నాటి నుంచి అవినీతికి, అవకతవకలకు తావులేకుండా పక్కాగా, పకడ్బం దీగా అర్హులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను అందిస్తున్నాయి.

ఇంటి వద్దకే సేవలు



గతంలో ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి పరుగులు తీసేవాళ్లం. ఒక పని కోసం అన్ని పనులు మానుకుని తిరిగేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రేషన్ కార్డు, ఇంటి స్థలం, పింఛను, జనన, మరణ ధృవీకరణ పత్రాలు ఇలా ఏమి కావాలన్నా..ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రామంలో అన్ని సేవలు పొందుతున్నాం.

–మలబంటి కోటేశ్వరరావు, రైతు, బాపట్ల.

ఎంతో ఉపయోగం..



సచివాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు సత్వర సేవలందిస్తున్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా, తక్షణం స్పందిస్తూ.. అన్ని పనులు చేస్తున్నారు. ఇలాంటి వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

–పుట్టా శ్రీనివాసరెడ్డి, ప్రైవేటు ఉద్యోగి, బాపట్ల.

బాపట్ల మండలం రూరల్‌లో నాలుగేళ్లలో గ్రామ సచివాలయాల ద్వారా అందిన సేవలు ఇవీ..

గ్రామ సచివాలయాల సంఖ్య: 21
పథకాల లబ్ధిదారుల సంఖ్య: 95,564
అన్ని పథకాలకు సంబంధించి చేకూరిన లబ్ధి రూ.1,490 కోట్లు

పథకాల వారీగా లబ్ధిదారులు

వైఎస్సార్ ఆసరా : 15,691
జగనన్న అమ్మ ఒడి: 6,571
అర్చకులు–31
చేదోడు –197
రైతు బీమా–3,907
ఈబీసీ నేస్తాం– 1,574
హిమామ్ –6
ఇన్‌పుట్ సబ్సిడీ–5,527
జగనన్న తోడు–1,556
జగనన్న వసతి దీవెన– 2,413
జగనన్న విద్యాదీవెన– 4,398
కాపు నేస్తం– 151
మత్స్యకార భరోసా–1,386
ఫాస్టర్స్ –95
పెన్షనర్లు –11,608
రైతు భరోసా– 8,452
సున్నా వడ్డీ పంట రుణాలు –3,483
సున్నా వడ్డీ–15,653
వాహన మిత్ర– 524
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ–500
వైఎస్సార్ బీమా –926
వైఎస్సార్ చేదోడు–10,915

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పలు గ్రామాల వద్ద ఆదివారం సాయంత్రం ఆయన ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లందరూ ఖచ్చితంగా లైసెన్సు కలిగి ఉండాలని, యూనిఫాం ధరించి ఉండాలన్నారు. లైసెన్సు లేకుండ ఆటో నడిపి ప్రమాదాలకు గురైతే బాధితులకూ ఇన్సూరెన్స్ సంబంధిత న్యాయం జరగదని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని అవసరమైతే ప్రాంతీయ రవాణా అధికారి వద్ద హాజరుపరచి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. 17 ఆటోలు తనిఖీ చేయగా ఒక్క డ్రైవరూ యూనిఫాం ధరించలేదని, వారికి అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

తైక్వాండో పోటీల్లో నాలుగు బంగారు పతకాలు

తెనాలిఅర్బన్: ఇండియా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్‌లో తెనాలి కేఎస్‌ఆర్ తైక్వాండో అకాడమి విద్యార్థులకు నాలుగు బంగారు, నాలుగు వెండి, ఐదు కాంస్య పతకాలు లభించాయని కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. వీటిని విశాఖపట్నంలో ఈ నెల రెండు నుంచి నాలుగు వరకు నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం అకాడమీలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ కుర్రా సుజాత, సీనియర్ కోచ్ పొలయ్య అభినందించారు.

చిరస్మరణీయుడు మోటూరు హనుమంతరావు



మోటూరు హనుమంతరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రమాదేవి, సీపీఎం నేతలు



మోటూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వెల్లటూరు (భట్టిప్రోలు): చరిత్రలో కొద్దిమంది మాత్రమే చిరస్థాయిగా నిలిచిపోతారని, అందులో కామ్రేడ్ మోటూరు హనుమంతరావు ఒకరని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. వెల్లటూరులో మోటూరు హనుమంతరావు 22వ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రమాదేవి మాట్లాడుతూ హనుమంతరావు శాసన సభ, మండలి సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, పత్రికా సంపాదకులుగా వ్యవహరించడమే గాక అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై మోటూరు హనుమంతరావు నిరంతరం పోరాటం చేశారని, ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని కోరారు. రేపల్లె, లంక గ్రామాలలో వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయడంలో ఆయన ముఖ్య భూమిక వహించారన్నారు. తన ఆస్తిని పార్టీకే త్యాగం చేసి, నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అదే విధంగా హనుమంతరావు సహచరుడు పమిడిముక్కల లక్ష్మణరావు స్థూపం వద్ద కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి. సుధాకర్, నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కె. రామస్వామి, జి.నాగరాజు, దీపాల సత్యన్నారాయణ, సుబ్బారావు, బోస్ పాల్గొన్నారు.

మోటూరి సేవలు చిరస్మరణీయం

రేపల్లె రూరల్: పేదల పక్షపాతిగా మోటూరు హనుమంతరావు సేవలు ఎనలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మోటూరు హనుమంతరావు వర్ధంతిని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రేపల్లె తొలి శాసన సభ్యునిగా ఎన్నికైన హనుమంతరావు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దానియేలు, రమేష్, ధర్మరాజు, రామకృష్ణ, ప్రసాద్, మరియదాసు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు ఉపకార వేతనాలు

తెనాలి: పట్టణ, పరిసరాల్లోని కాలేజీల్లో చదువుకునే ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను స్థానిక గంగానమ్మపేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి కమిటీ హాస్టలులో కల్పిస్తామని సంస్థ కార్యదర్శి పెండేల వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్ నుంచి పీజీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ఉచిత వసతి కోసం దరఖాస్తులు కమిటీ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అవసరమైన ఆర్యవైశ్య విద్యార్థులు ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను తీసుకుని పూరించి అందజేయాలని కోరారు. ముందుగా వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన 100 మంది విద్యార్థులను హాస్టలులో ప్రవేశం కల్పిస్తామని వివరించారు. ఇతర వివరాలకు : 94402 58574 నంబరును సంప్రదించవచ్చని సూచించారు.

ఉపకారవేతనాలు పంపిణీ..

2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో 925 మార్కులుపైన, డిగ్రీ కోర్సుల్లో 80 శాతం పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఉపకార వేతనం ఇవ్వనున్నట్టు పెండేల వెంకట్రావు తెలియజేశారు. అర్హత కలిగిన ఆర్యవైశ్య విద్యార్థినులు సంబంధిత మార్కుల జాబితా జిరాక్స్, ఆధార్ కార్డుతో సహా ఈనెల 30వ తేదీలోగా సంస్థ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

25న తెనాలిలో ఈ–శ్రమ్ గుర్తింపు కార్డుల జారీ

తెనాలి: దేశంలోని అసంఘటిత కార్మికులతోపాటు సినిమా పరిశ్రమలోని 24 విభాగాల కార్మికులకు కూడా భారత ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తుందని గుంటూరు జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ ధూళిపూడి వెంకట శివప్రసాద్ అన్నారు. తెనాలిలోని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (మా–ఏపీ) కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మా–ఏపీ సహకారంతో ఈనెల 25న తెనాలి సుల్తానాబాద్‌లోని రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో ఉదయం 9 గంటల్నుంచి అర్హులకు ఈ–శ్రమ్ కార్డులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. 16–59 సంవత్సరాల వయసుకలు, పీఎఫ్ లేని అసంఘటిత కార్మికులంతా అర్హులేనని చెప్పారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఆరోజు రావాలని, 12 అంకెల యూనివర్సల్ అకౌంట్ నంబరు గల గుర్తింపు కార్డులను జారీచేస్తామని శివప్రసాద్ తెలిపారు. వీరి ఆధార్‌కార్డుకు ఫోన్ నంబరు లింకయి ఉండాలన్నారు. ఒకే ఇంట్లో ఉండే నలుగురు కూడా అర్హులేనని చెప్పారు. అలాగే ప్రధానమంత్రి శ్రమ యోజన్ మాంధన్ పేరుతో 18–40 వయస్కులకు పెన్షన్ స్కీము అమల్లో ఉందన్నారు. ఇందులో చేరే సభ్యులు వయసు ప్రకారం నెలకు రూ.50 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి ఉంటుంది. వీరికి మరణించే వరకు ప్రభుత్వం పింఛను ఇస్తుందని వివరించారు. మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ అసోసియేషన్‌లోని కార్మికులే కాకుండా రిక్షా కార్మికులు, బీడీ కార్మికులు, విస్తరాకుల తయారీదారులు, ఇటుకరాళ్ల కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండి వ్యాపారులు సైతం ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులను పొందవచ్చని వివరించారు. అసోసియేషన్ సభ్యులు ఆలియా, ధనలక్ష్మి, మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌదరి, అరుణకుమారి, రఫీ, శ్యామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హేతుబద్ధంగా ఆలోచించాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

బాపట్ల: హేతుబద్ధంగా ఆలోచించి.. మానవత్వంతో జీవించాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు కె.హనుమంతరావు అన్నారు. హేతువాదనలు ప్రేరేపించడమే హేతువాద మనవావాద ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. బాపట్లలోని ఎన్జీవో హోంలో హేతువాద సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. భారత హేతువాద సంఘ ట్రెజరర్ షేక్ బాబు మత చాందస వాదం అనే అంశం మీద ప్రసంగిస్తూ మనుషులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, వివేకంతో జీవించే అవకాశం ఉండాలన్నారు. భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ విశ్వతత్వం – పరిణామం అంశం మీద ప్రసంగించారు. విశ్రాంత అధ్యాపకులు కారు మంచి విజయ్ కుమార్, గోరంట్ల శాంతారాం, బాపట్ల హేతువాద సంఘ అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు, హేతువాద సంఘ సహాయ కార్యదర్శి సింహాద్రి యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలపై ప్రచారం



కరపత్రాన్ని అందచేస్తున్న కమిటీ నాయకులు

భట్టిప్రోలు: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, పలు డిమాండ్ల సాధనకు చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బాపట్ల కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన ఆందోళనను చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. ఈ మేరకు కమిటీ నాయకులు భట్టిప్రోలు, ఐలవరం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యన్నారాయణ, దొంతు శ్రీనివాసరావు, దీపాల సత్యన్నారాయణ, బి.నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూద స్థావరాలపై పోలీసుల దాడులు

వేర్వేరు ప్రదేశాల్లో 12 మంది అరెస్టు



అరెస్టు చేసిన జూదరులతో ఎస్ఐ డి.రవీంద్రబాబు

ప్రత్తిపాడు: రెండు గ్రామాల్లోని రహస్య జూద స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు చేసి, పన్నెండు మంది జూదరులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. పెద గొట్టిపాడులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచ్ తో పాటు ఎస్ఐకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.15,010 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్తిపాడు శివారులో..

ప్రత్తిపాడులోని శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రవీంద్రబాబు జూద స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రవీంద్ర బాబు తెలిపారు.

క్రీడలతో పోరాట పటిమ మెరుగు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న గుంద్రెడ్డి శివ

ఏట్రావారిపాలెం(కర్లపాలెం): క్రీడాకారులతో శారీరక ధృడత్వంతో పోరాట పటిమ మెరుగుపడుతుందని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుంద్రెడ్డి శివ పేర్కొన్నారు. ఏట్రావారిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మూనగల అయ్యప్పరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఫైనల్‌లో ఏట్రావారిపాలెం, పొన్నపల్లి టీమ్‌లు తలపడగా.. ఏట్రావారిపాలెం విజేతగా నిలిచింది. గుంద్రెడ్డి శివ రూ.25,116లు నగదు బహుమతిని విజేత జట్టుకు అందజేశారు. రన్నర్ పొన్నపల్లి టీమ్‌కు మునిరెడ్డి, శంకర్‌రెడ్డి సహకారంతో రూ.15,116లు, తృతీయ స్థానంలో నిలిచిన ఎంవీరాజుపాలెం టీమ్‌కు కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మోపర్తి జాన్ సహకారంతో రూ.10,116లు నగదు బహుమతి అందజేశారు. అలాగే 4వ బహుమతి బ్రహ్మారెడ్డి సహకారంతో రూ.5,116లు, 5వ బహుమతి మార్పు బెనర్జి సహకారంతో రూ.3,116లు, మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అయ్యప్ప రెడ్డి సహకారంతో రూ.2,116లు అందజేశారు.

ఏడు ఎకరాల గడ్డి వాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక అధికారులు

మంటల్లో కాలిపోయిన ట్రాక్టర్ ట్రక్కు



చిన పులివర్రులో దగ్ధమైన గడ్డి వామి

బాపట్లటౌన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఎకరాల గడ్డి వామి దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. చీరాల మండలం, పాత చీరాలకు చెందిన కుక్కల పోతురాజురెడ్డి బాపట్ల మండలం, చెరువుజమ్ములపాలెంలో రెండు ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి పాత చీరాలకు చెందిన పుట్టా శివకృష్ణారెడ్డి ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా.. జమ్ములపాలెం ఫ్లై ఓవర్‌బ్రిడ్జి సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. గడ్డితోపాటు, ట్రాక్టర్ ట్రక్కు దగ్ధమైంది. రూ. 1.50 లక్షల మేరా నష్టం వాటిల్లింది. వెంటనే స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో, వెంటనే సిబ్బంది స్పందించి మంటలను అదుపుచేశారు.

5 ఎకరాల వరిగడ్డి దగ్ధం

కొల్లూరు: వరిగడ్డి వాము దగ్ధమైన ఘటన చిన పులివర్రుల్లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన పులివర్రుకు చెందిన దొప్పలపూడి కోటేశ్వరరావు ప్రధాన రహదారి వెంబడి ఉన్న తన పొలంలో వరిగడ్డి వామి వేశాడు. మధ్యాహ్నం గడ్డివామి నుంచి మంటలు రావడం గమనించి, ఆర్పేందుకు ప్రయత్నాలు చేశారు. అప్పటికే మంటలు అధికమవడంతో గడ్డివామి అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. గుర్తుతెలియని నిప్పుపెట్టి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్గికి ఆహుతైన వరిగడ్డి సుమారు రూ.60వేలు ఉండొచ్చు అని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజీవ్ శ్యామ్యూల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం అపహరణపై కేసు నమోదు

బాపట్లటౌన్: బంగారం అపహరణకు గురైందంటూ మండలంలోని చెరువు జమ్ములపాలెం గ్రామానికి చెందిన నూతలపాటి పద్మశ్రీ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నల్ల పూసల దండను అపహరించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

యువకులపై కేసు నమోదు

పెద నందిపాడు: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు, అతనికి సహకరించిన స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు పెదనంది పాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బాలికతో టి.కార్తీక్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని, అతనికి స్నేహితులు కె.ప్రభాస్, ఎం హరిప్రసాదు సహకరించారని ఆయన చెప్పారు. ఆదివారం రాత్రి బాలిక తల్లి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభివృద్ధి



కరపత్రాలను విడుదల చేస్తున్న వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని

కొండపాటూరు(కాకుమాను): వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధి సాధ్యమని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని అన్నారు. కొండపాటూరులో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్సార్ సీపీ ముస్లిం, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా పిలుపు మేరకు హర్‌దిల్ మే వైఎస్సార్ హమ్ జగన్‌కు సాథ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. ఆ మహా నేత తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేబినెట్‌లో, నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని ముస్లిం, మైనార్టీలందరూ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా పాల్గొన్నారు.